బ్రిడ్జి నిర్మాణానికి రాజకీయ గ్రహణం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.6.32 కోట్ల నిధుల మంజూరు
- పనులను అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు


సోదనపల్లి వంకపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు (ఫైల్)


సోదనపల్లి-పోతురాజుకాల్వ గ్రామాల మధ్య ఉన్న వంక

శింగనమల: సోదనపల్లి వంక బ్రిడ్జి నిర్మాణానికి రాజకీయ గ్రహణం పట్టుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రతిపాదనలు పంపి సోదనపల్లి వంకపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి పీఎంజీఎస్‌వై -3 ఫేస్ కింద రూ.6.32 కోట్లు నిధులు మంజూరు చేయించి, భూమి పూజ చేశారు. అయితే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకుండా కూటమి ప్రభుత్వంలోని టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. శింగనమల మండలంలోని పోతురాజు కాల్వ నుంచి సలకం చెరువు వరకూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 11 కి.మీ . తారు రోడ్డు వేయించారు. దీని వలన దాదాపు 20 గ్రామాల ప్రజలకు అనంతపురానికి వెళ్లాలన్నా, తాడిపత్రికి వెళ్లాలన్నా అనంతపురం-తాడిపత్రి రోడ్డులోకి త్వరగా చేరుకవడానికి అనుకూలం. కానీ ఈ రోడ్డుకు సోదనపల్లి -పోతురాజుకాల్వ గ్రామాల మధ్యన శింగనమల చెరువు మరువపారితే , ఆ నీరు పారే పెద్ద వంక ఉంది. వంక పూర్తిగా పారితే ఈ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడమే గాక, పోతురాజుకాల్వ గ్రామానికి చెందిన విద్యార్థులు సోదనపల్లి జెడ్పీ హైస్కూల్‌కు రాకుండా నిలిచిపోతారు. ఈ సమస్యలు తెలుసుకున్న అప్పటి ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిలు స్పందించి, బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో పీఎంజీఎస్‌వై -3 ఫేస్ కింద రూ.6.32 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ పనులను పుట్లూరు చెందిన కాంట్రాక్టర్ దక్కించుకున్నారు.

ఎన్నికల ముందు బ్రిడ్జి నిర్మాణానికి ప్రారంభోత్సవం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు మార్చి 11న బ్రిడ్జి నిర్మాణానికి చక్రాయిపేట సర్పంచ్ సరోజమ్మ భూమి పూజ చేసి ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు పాల్గొన్నారు. ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభించలేకపోయారు. ఎన్నికల అనంతరం పనులను ప్రారంభించడానికి క్రాంట్రాక్టర్ ప్రయత్నించగా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. ఆ పనులు మాకే కావాలని, మా ప్రభుత్వంలో పనులు మీరెలా చేస్తారని, అధికారులపై ప్రజాప్రతినిధుల ద్వారా ఒత్తిడి చేయిస్తున్నారు. దీంతో పనులు ప్రారంభం కాకుండా నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



సోదనపల్లి-పోతురాజు కాల్వ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టాలి. బ్రిడ్జి నిర్మాణం చేపడితే 20 గ్రామాలకు ఎంతో ఉపయోగకరం. శింగనమల చెరువు మరువ పారితే ఈ రోడ్డు మీద రాకపోకలు నిలిచిపోతాయి.

– వీర, సోదనపల్లి

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. బ్రిడ్జి నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చాయి.

– రామాచంద్రారెడ్డి, డీఈ, అనంతపురం

సమస్యల పరిష్కారంలో చంద్రబాబు విఫలం


తాడిపత్రి మండలం సజ్జలదిన్నెలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

తాడిపత్రి రూరల్: పేదల సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విఫలమయ్యారని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రంగయ్య విమర్శించారు. మండలంలోని సజ్జలదిన్నెలో శుక్రవారం వారు ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా పేదలను పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకరంగా ఈనెల 18న సచివాలయాల్లో పేదల చేత ఆర్జీలు స్వీకరిస్తామన్నారు. సజ్జలదిన్నె గ్రామంలో ప్రభుత్వ భూములను అక్రమించి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. వీటిని కలెక్టర్ స్వాధీనం చేసుకొని పేదలకు ఇళ్ల పట్టాల రూపంలో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నారాయణరెడ్డి, ఓబులేసు, గోపాల్, ఎర్రప్ప, నాగార్జున, భవానీ, మునెమ్మ, లక్ష్మీదేవి, రాములమ్మ తదితరులు ఉన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలి.

పెద్దవడుగూరు: పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇంటిని నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ తాడిపత్రి నియోజక వర్గ కార్యదర్శి రంగయ్య, మండల నాయకుడు వెంకట్రాముడుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు నారాయణ, ఓబిరెడ్డి, ఆదినారాయణ, హుస్సేన్‌పీరా, రంగనాయకులు, అల్లాబకాస్, శేషు గోపాల్, ముత్యాలరెడ్డి, సుధాకర్‌గౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

గుత్తి: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం సీపీఐ నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సంయుక్తంగా నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రామదాసు , నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, రైతు సంఘం అధ్యక్షులు వెంకట రాముడుమాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం తో పాటు రూ. 5 లక్షలు ఇళ్ల నిర్మాణానికి ఇవ్వాలనే ప్రధాన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 18న వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో సచివాలయాల వద్ద ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు నరసింహయ్య, పట్టణ కార్యదర్శి రాజు యాదవ్, సహాయ కార్యదర్శి నజీర్, షఫి, రామకృష్ణ, నూర్జాహాన్, మల్లి , నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సముండా జయంతి

శింగనమల/గుంతకల్లు రూరల్: శింగనమల మండలంలోని నాగులగుడ్డం తండా గ్రామంలో ఆదివాసి స్వాతంత్ర సమరయోధులు బిర్సముండా 150 జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామసభ ఏర్పాటు చేశారు. డీఎల్‌డీఓ లలితాబాయి మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతమైన గిరిజన తండాలో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఈఓఆర్‌డీ వెంకటలక్ష్మి, మండల వైద్యాధికారి డాక్టర్. శంకర్‌నాయక్, ఏఓ అన్వేష్‌కుమార్, వెటర్నరీ వైద్యులు కిరణ్‌కుమార్ రెడ్డి, ఆయుర్వేద వైద్యులు మాధవి, సీడీపీఓ ఉమాశంకరమ్మ, మండల విద్యాశాఖాధికారి నరసింహరాజు, తదితరలు , గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు మండలంలోని గుండాల తండాలో శుక్రవారం ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి , ఎంపీపీ బీవీ మాధవి ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

భారీ వర్షానికి నేలవాలిన పంటలు


శింగనమలలో నేలవాలిన వరి

శింగనమల/బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: శింగనమల మండలంలోని అలంకరాయునిపేటలో సాగు చేసిన వరి పంట గురువారం రాత్రి కురిసిన వర్షానికి నేలవాలిందని రైతులు ఆదిరెడ్డి, సౌరెడ్డి, ఆదిలక్ష్మి, పెద్దిరెడ్డి వాపోయారు. దాదాపు రూ.2.50 లక్షలు పంట నష్టం వాటిల్లిందని వారు వాపోయారు. అలాగే గురు, శుక్రవారం కురిసిన వర్షానికి గార్లదిన్నె మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట దెబ్బతినింది. కొప్పలకొండ, మర్తాడు, ఇల్లూరు, కల్లూరు, ముంటిముగుడు, కేశవాపురం గ్రామాల్లో 47 మంది రైతులకు సంబంధించి 38 హెక్టార్లలో వరి పంట నేలవాలినట్లు ఏఓ సోమశేఖర్ తెలిపారు. అదేవిధంగా బుక్కరాయసముద్రం మండలంలోని గోవిందపల్లి, నీలాంపల్లి, జంతలూరు బోయ కొట్టాల, కొర్రపాడు, రెడ్డిపల్లి, వడియంపేట, గ్రామాల్లో వరి, మొక్కజొన్న తదితర వర్షాలకు దెబ్బతిన్నాయి. ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, సిబ్బందితో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. దెబ్బతిన్న పంటలు గుర్తించి, ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతులు కోరారు.

ఎస్‌ఆర్‌ఐటీలో ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో


ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం వారు ప్రాజెక్ట్ ఇన్నోవేషన్ ఎక్స్‌పో నిర్వహించారు. ఎక్స్‌పోలో విద్యార్థులు వాస్తవ ప్రపంచ సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను ప్రదర్శించే స్ఫూర్తి దాయకమైన ప్రెజెంటేషన్‌లు చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ తెలిపారు. ఈవెంట్‌లో ఎంబెడెడ్ సిస్టంలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అప్లికేషన్‌లతో సహా వివిధ విభాగాల్లో విస్తృతమైన ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు ఎక్స్‌పోను సందర్శించి ప్రాజెక్టుల పని తీరును తెలుసుకునేందుకు ఆసక్తి కనబరిచారు. బెస్ట్ ఇన్నోవేషన్, బెస్ట్ ప్రెజెంటేషన్ మొదలైన కేటగిరిల్లో టాప్ ప్రాజెక్టులకు అవార్డులను అందించారు. కార్యక్రమంలో టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సాయి చైతన్య కిషోర్, డాక్టర్ రవిచంద్ర, వరుణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు


గాయపడిన సందీప్

గుత్తి రూరల్: మండలంలోని ఎంగిలిబండ గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ద్విచక్రవాహనంలో నుంచి పడి సందీప్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మండలంలోని టి.కొత్తపల్లికి చెందిన కేశవ అనే వ్యక్తి గ్రామంలో హోటల్ నిర్వహిస్తున్నాడు. హోటల్‌లో పార్సిళ్ల కోసం న్యూస్ పేపర్లు కొనుగోలుకు కేశవ తన కుమారుడు సందీప్‌తో కలిసి గుత్తికి వచ్చాడు. అనంతరం తిరిగి గ్రామానికి వెళ్తుండగా ఎంగిలిబండ గ్రామ శివారులో పెట్రోల్ బంకు ఎదురుగా వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనంలో నుంచి సందీప్ జారి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన బాలుడిని వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సీఎస్ఐ టౌన్ చర్చి శత వసంతాల వేడుక


కోలాటంతో ఆకట్టుకుంటున్న మహిళలు

గుత్తి: పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చి స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన వేడుకలు అంబరాన్ని తాకాయి. చర్చి కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సంబరాలు నిర్వహిస్తున్నారు. తొలి రోజు శుక్రవారం ర్యాలీ చేపట్టారు. మహిళలు కోలాటంతో ఆకట్టుకున్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం ప్రముఖులకు సన్మానం, ఆదివారం సభ నిర్వహించి చర్చి ప్రాముఖ్యతను వివరించనున్నారు. కార్యక్రమంలో సీఎస్ఐ టౌన్ చర్చి కమిటీ చైర్మన్ రెవరెండ్ సాల్మన్, సెక్రెటరీ సురేంద్రబాబు, కోశాధికారి జేజే మనోరంజిత, డివిజనల్ సెక్రెటరీ విజయకుమార్, ఎడ్యుకేషన్ బోర్డు సెక్రెటరీ రస్సెల్ కిరణ్, కమిటీ సభ్యులు బింగి కిరణ్ బాబు, దయానంద్, వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు.

శోభాయమానం.. కార్తీక దీపోత్సవం


యాడికిలో ఆకాశదీపాన్ని చూసేందుకు తరలివచ్చిన భక్తులు


కసాపురంలో జ్వాలా తోరణాన్ని వెలిగిస్తున్న దృశ్యం


గుంతకల్లు బుగ్గ సంగమేశ్వర ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు


గుత్తిలోని కాశీ విశ్వేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


బుక్కరాయసముద్రం కాశీ విశ్వేశ్వరుడి ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు పెడుతున్న భక్తులు


యాడికిలోని వాసవీ ఆలయంలో కోటి ఒత్తులతో దీపాన్ని వెలిగిస్తున్న ఆర్యవైశ్య సంఘం మహిళలు


శింగనమలలోని రామాలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


పామిడి భోగేశ్వరాలయంలో లక్ష దీపారాధన

తాడిపత్రి అర్బన్/గుంతకల్లు రూరల్/బుక్కరాయసముద్రం/పామిడి/గుత్తి/శింగనమల/పామిడి/యాడికి: కార్తీకమాసం... అందునా పౌర్ణమి... ఆ పరమశివునికి ప్రియమైన రోజు..ఆ మహాశివుడి దర్శనం కోసం భక్తులు వేకువజామునే ఆలయాల్లో బారులు తీరారు. తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో కార్తీక దీపోత్సం ఘనంగా నిర్వహించారు. అలాగే పలు ఆలయాల్లో జ్వాలా తోరణం, ఆకాశదీపోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద అన్నదానం నిర్వహించారు.

క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం


రక్త గ్రూపు నిర్ధారణ కార్డులను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని సబ్ రిజిస్ట్రార్ షామీర్‌బాషా, వన్ టౌన్ సీఐ మనోహర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తదానంపై అవగాహనతోపాటు బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు రక్త నిర్ధారణ పరీక్షలు నిర్వహించి గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.హరిప్రసాద్ యాదవ్, నాయకులు వినోద్‌కుమార్, షౌకత్ అలీ, సంఘ సేవకులు దామోదర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్ బోల్తా

యాడికి: మండలంలోని పిన్నేపల్లి జగనన్న కాలనీలో శుక్రవారం సాయంత్రం విద్యార్థులను దింపేందుకు వచ్చిన ఓ ప్రైవేట్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పల్లంలోకి దూసుకెళ్లింది. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో చదువుతున్న కాలనీలోని విద్యార్థుల కోసం స్కూల్ నిర్వాహకులు బస్సును ఏర్పాటు చేశారు. అయితే డ్రైవింగ్‌పై పెద్దగా అవగాహన లేని వ్యక్తిని బస్సుకు డ్రైవర్‌గా ఏర్పాటు చేశారు. దీంతో శుక్రవారం 30 మంది విద్యార్థులతో కాలనీకి చేరుకున్న బస్సును డ్రైవర్ రివర్స్ చేస్తూ పల్లంలోకి దూసుకెళ్లిపోయాడు. బస్సులోని విద్యార్థులు గట్టిగా కేకలు వేయడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ప్రమాదం తప్పింది.

నెట్టికంటుడికి విరాళం


విరాళం అందజేస్తున్న దాత

గుంతకల్లు రూరల్: తాడిపత్రి మండలం, కొండేపల్లి గ్రామానికి చెందిన జీ శ్రీనివాసరావు అనే భక్తుడు శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున అర్చకులు ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ నిత్యాన్న దానసత్రం నిర్వహణలో భాగంగా ఈ మొత్తాన్ని అందజేసినట్లు దాత తెలిపారు.

సినీ నటుడు కృష్ణకు నివాళి

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సినీ నటుడు సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. సినీ పరిశ్రమకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాముడు, చలపతి, సభ్యులు విశ్వనాథ్, లోకారెడ్డి, బషీర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. నారాయణుడి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి కల్యాణోత్సవం అర్చకులు ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా నారాయణస్వామి, చక్ర భీమలింగేశ్వరులను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఈఓ సుబ్రమణ్యం, ఆలయ సిబ్బంది అరుణ్ కుమార్, గురప్ప, రాఘవ సౌకర్యాలు కల్పించారు.దాతల సహకారం కల్యాణోత్సవాన్ని నిర్వహించి, అన్న దానం నిర్వహించారు. కార్యక్రంలో అర్చకులు బాలసుబ్రమణ్యశర్మ, సుధీర్‌కుమార్ శర్మ, సునీల్‌కుమార్‌శర్మ, కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేయించండి

గుంతకల్లుటౌన్: రహదారుల్లో ప్యాచ్ వర్క్‌లను పూర్తి చేయించి ప్రమాదాలను అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానికుల ఫిర్యాదు మేరకు వినాయక ఘాట్ వద్ద జాతీయ రహదారిపై ఏర్పడిన మ్యాన్ హోల్‌ను ఇంజినీరింగ్ కార్మికుల చేత మూసివేయించారు. ప్రజలకు ఇబ్బందికరంగా మారిన మ్యాన్‌హోల్స్‌ను మూసివేయించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వేగేట్ మూసివేత

పామిడి: పామిడి-కల్లూరు సెక్షన్ నడుమ పామిడిలోని 244/42-44 మైలురాయి వద్ద ఉన్న ఎల్‌సీ గేట్ నంబర్ 145ను ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకూ మూసివేస్తున్నట్లు కల్లూరు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు గడ్డం రవిబాబు శుక్రవారం తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా గేట్ మూసివేస్తామన్నారు. పామిడి నుంచి పీ కొండాపురం తదితర గ్రామాలకు వెళ్ళే ప్రజలు గమనించాలన్నారు. రోడ్డు డైవర్షన్‌లో భాగంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వీరాంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, యల్లనూరు రోడ్డు, చింతల వెంకటరమణస్వామి ఆలయం ప్రాంతాల్లో ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

నేడు లీగల్ లిటరసీ క్యాంపు

పామిడి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ లీగల్ లిటరసీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న శనివారం తెలిపారు. గుత్తి మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ఆరో అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎం.శ్రీహరి, గుత్తి సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ ఆచారి, ఏపీ మహిళా కమిషన్ మెంబర్ ఎస్‌కే రొకియా బేగం రీసోర్స్ పర్సన్లుగా హాజరవుతారన్నారు. అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రేపు కోటంకలో లక్ష దీపోత్సవం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు రామాచార్యులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భం ఏటాలాగే తెల్లవారుజామున 4గంటలకు రుద్రాభిషేకం,సాయంత్రం 6-15 గంటలకు లక్ష దీపోత్సవం, రాత్రి 9 గంటలకు భజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంరతం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఇసుక తరలిస్తే కేసులు

గార్లదిన్నె: పెన్నానది పరివాహక ప్రాంతంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఈరమ్మ,ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా హెచ్చరించారు. శుక్రవారం వారు మండలంలోని కొప్పలకొండ, కేశవాపురం గ్రామంలో పెన్నానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొప్పలకొండలో అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుక తరలించడంతో భూగర్భ జలాలు అడుగంటి సాగు చేసిన పంటలకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని కేశవాపురం రైతులు మొరపెట్టుకున్నారు. అధికారులు మాట్లాడుతూ కొప్పలకొండలో అక్రమంగా ఇసుక తరలింపు అరికడతామన్నారు. ఇసుకను ఎవరూ అక్రమంగా తరలించకుండా రెవెన్యూ, పోలీసు గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

గార్లదిన్నె: మండల కేంద్రంలోని ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో తెలుగు టీజీటీ అతిథి ఉపాధ్యాయ పోస్టుకు అర్హులైన నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉండడంతో బీఈడీలో తెలుగు మెథడాలజీ, భాషా ప్రవీణ చేసిన నిరుద్యోగులు పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.14,800 వేతనం ఇస్తామన్నారు. అర్హులైన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8712625062 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

26న కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఈ నెల 26న నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు శుక్రవారం తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు రెండు పాస్ ఫోటోలు తెచ్చుకోవాలన్నారు.

మార్కెటింగ్ మెలకువలపై అవగాహన

గుంతకల్లుటౌన్: ముడి పదార్థాల సేకరణ, సరుకుల తయారీ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెలకువలపై ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ ఫైనలియర్ విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు శుక్రవారం పారిశ్రామిక వాడలో ఫీల్డ్‌విజిట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మారుతి ఇండస్ట్రీస్ రైస్‌మిల్లు తదితర పరిశ్రమల్లో విద్యార్థులకు ఉత్పత్తుల తయారీ, అకౌంటింగ్‌లపై వివరించారు. అలాగే జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు కోళ్ల ఫారం, సెరికల్చర్ యూనిట్‌లను సందర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, కామర్స్, జంతుశాస్త్ర విభాగపు అధ్యాపకులు డాక్టర్ రాఘవేంద్ర, బసవరాజు, అల్తాఫ్, జమీలాబీ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'వసతి, విద్యాదీవెన నిధులు విడుదల చేయాలి'

గుంతకల్లుటౌన్: పెండింగ్‌లో ఉన్న వసతిదీవెన, విద్యాదీవెన నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఈ నెల 18న విజయవాడలో ఎస్‌ఎఫ్ఐ నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆయన విడుదల చేశారు. ధర్నాకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్ఐ నాయకులు సి.రమేష్, వెంకటేష్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రాజా

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దారుగా రాజా శుక్రవారం బాధతలు తీసుకున్నారు. గతంలో రెగ్యులర్ తహసీల్దారుగా ఇక్కడ పని చేస్తున్న నాగరాజు దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో సీఎస్‌డీటీకి అదనపు బాధ్యతలను అప్పగించారు. కొన్ని రోజులుగా పుట్లూరు తహసీల్దారు శేషారెడ్డికి యల్లనూరు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. ఇటీవల సాక్షి దిన పత్రికలో వచ్చిన 'ఇక్కడ అన్నీ ఇన్‌ఛార్జి పోస్టులే ' అన్న కథనానికి స్పందించిన జిల్లా అధికారులు యల్లనూరు సీఎస్‌డీటీకి ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాధ్యతలు అప్పగించారు. అలాగే రీ సర్వే డీటీగా నియమితులైన మునీంద్రకు అదనపు డీటీగా బాధ్యతలను అప్పగించారు.